సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం, 13, ఆగస్టు, 2025



తాళం వేసిన ఇళ్లే టార్గెట్

తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి చోరీకు పాల్పడుతున్న యువకుడిని, బాలికను నకిరేకల్ పోలీసులు అరెస్ట్ చేశారు.

- 8లో



పర్యావరణ పరిరక్షకులుగా..

విద్యార్థులను పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు.

- 8లో



22ఏళ్ల జైలు శిక్ష

కూతురిపై అత్యాచారం జరగడానికి కారణమైన తల్లికి 22ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి తీర్పునిచ్చారు.

- 8లో

న్యూస్‌రీల్

జిల్లాలోని స్కూళ్లకు నేడు, రేపు సెలవు

భువనగిరి : జిల్లాలో భారీ నుంచి, అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో భువనగిరి జిల్లాలోని పాఠశాలలకు బుధవారం, గురువారం (రెండు రోజులు) సెలవులు ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్, డీఈఓకు ఉత్తర్వులు అందాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విధిగా సెలవులు పాటించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉపాధి పనుల్లో పూర్తి పారదర్శకత



హర్ ఘర్ తిరంగా- హర్ ఘర్ స్వచ్ఛత వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్ చేసే విధానంతో ఉపాధి పనుల్లో పూర్తి పారదర్శకత ఉంటుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఇటీవల ప్రవేశపెట్టిన మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్ చేసే విధానం, జియో ఫెన్సింగ్, జియో రిఫరెన్స్, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా పేస్ అంథంటికేషన్ హాజరు నమోదుపై మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రతి గ్రామంలో 30 ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా 12,810 ఇంకుడు గుంతలు పూర్తి చేయాలన్నారు. అనంతరం హర్ ఘర్ తిరంగా- హర్ ఘర్ స్వచ్ఛతా కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, సురేష్ అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ మందడి ఉపేందర్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్లు, అధికారులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లి దళార్చన



ఆకుపూజ నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజ విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయాల్లో సింధూరం పాటు పాలతో అభిషేకించారు. అనంతరం పూలతో అలంకరించి, నాగవల్లి దళార్చన జరిపించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొన్నారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

హామీలు అమలు చేయాలి

వలిగొండ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం వలిగొండ మండలంలోని సంగం(భీమలింగం) వద్ద ఆ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా సంగెం వద్ద మూసీ నది ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు హామీ కాగితాలకే పరిమితమైంది తప్ప ఒక్క రాయి కూడా కదల్లేదన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రజా తీర్పు తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బోళ్ల సుదర్శన్, చీరిక సుదర్శన్ రెడ్డి, కాసోని శ్రీనివాస్, నల్లమాస్ వెంకటేష్, ఉడుత భాస్కర్, పృథ్వీ, కాలభైరవ, మహేష్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న నారాయణరెడ్డి



అడ్డగూడూరు: ధర్మారం గ్రామశివారులోని బిక్కేరువాగుపై అలుగు పోస్తున్న చెక్ డ్యాం

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- అత్యవసర పరిస్థితుల్లో 08685293312 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచన

సాక్షి, యాదాద్రి : రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సేవలు అందించడానికి కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు 08685293312 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించాలన్నారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పోలీస్, రెవెన్యూ, వైద్య, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిల భవనాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు బయటకు రావద్దన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, వివిధ శాఖ ల అధికారులు పాల్గొన్నారు. భువనగిరి జోన్ డీసీపీ అక్షాంశ్ యాదవ్‌తో సమావేశమై వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

మారుతి కోటెక్స్‌లో జాతీయ జెండాల తయారీ



ఉత్పత్తి అవుతున్న త్రివర్ణ పతాకాలను పరిశీలిస్తున్న పరిశ్రమ నిర్వాహకులు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని మారుతి కోటెక్స్ పరిశ్రమలో జాతీయ జెండాల తయారీ ముమ్మరంగా జరుగుతోంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ జెండాలను ఇక్కడ ఉత్పత్తి చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా ఆర్డర్ లభించడంతో ఇటీవల ఉత్పత్తిని మొదలుపెట్టారు. త్రివర్ణ పతాకాల కోసం కాంట్రాక్టర్ ఈ కంపెనీకి 5లక్షల మీటర్ల సాదా వస్త్రాన్ని సరఫరా చేశారు. అక్కడి నుంచి అందిన వస్త్రాన్ని మారుతి కోటెక్స్ పరిశ్రమలో 8లక్షల జాతీయ జెండాలు తయారు చేసి ఇవ్వాల్సి ఉంది. అందులో భాగంగా ఇప్పటికే ప్రత్యేక వాహనాల ద్వారా సగానికిపైగా జెండాలను ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి తరలించారు. ఇంకా మిగిలిన సగం జెండాలు సైతం ఈ నెల 13లోపు అక్కడికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

వివిధ రకాల వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నాం



ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి జాతీయ పతాకాల ఆర్డర్ వచ్చింది. ఇప్పటికే సగానికిపైగా ఎగుమతి చేశాము. మిగిలినవి కూడా గడువులోగా పంపిస్తాము. పరిశ్రమలో రకరకాల వస్త్రాలను ఉత్పత్తి చేస్తుంటాము. 2021–2023 వరకు మూడు పర్యాయాలు బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేశాము. నిత్యం 150మంది కూలీలకు ఉపాధి లభిస్తుంది.

– వనం రాజు, మారుతీ కోటెక్స్ పరిశ్రమ మేనేజర్



ఎగుమతికి సిద్ధం చేసిన త్రివర్ణ పతాక గట్టాలు

కార్మికుల ప్రాణాలు.. గాలిలో దీపాలు!

- పరిశ్రమల్లో తరచూ సంభవిస్తున్న ప్రమాదాలు
- కనీస భద్రతాప్రమాణాలు పాటించని యాజమాన్యాలు
- తనిఖీలు నిర్వహించని సంబంధిత అధికారులు
- ఈ ఏడాది ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో నాలుగు సార్లు ప్రమాదాలు జరగగా.. ఆరుగురు కార్మికులు మృతి



తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్న పెద్ద కందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ

సాక్షి, యాదాద్రి : పరిశ్రమల్లో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. కనీస భద్రతాప్రమాణాలు పాటించకపోవడంతో కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఈ ఏడాది పెద్ద కందుకూరు, కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీల్లో నాలుగు సార్లు ప్రమాదాలు జరగగా.. ఆరుగురు కార్మికులు మృతిచెందారు. మరికొందరు గాయాలపాలయ్యారు. మంగళవారం తెల్లవారుజామున పెద్దకందుకూరు ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందాడు. హైరిస్క్ ఉన్న ఈ పరిశ్రమల్లో అధికారుల తనిఖీలు రికార్డులకే పరిమితమవుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

తనిఖీలకు మీనమేషాలు..

పరిశ్రమల్లో కార్మికుల భద్రతపై తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అధిక రిస్క్ ఉన్న ఫ్యాక్టరీలు, పరిశ్రమలను తక్షణమే తనిఖీ చేయాలని ప్రభుత్వం జీవో 331 జారీ చేసింది. ఇందులో భాగంగా ఈనెల 6న కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా తనిఖీల కమిటీలను ఏర్పాటు చేశారు. అయినా ఇంత వరకు జిల్లాలో ఉన్న హైరిస్క్ పరిశ్రమల్లో తనిఖీలు ప్రారంభించలేదు. దీంతో జిల్లాలోని పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమలు, రసాయన, ఫార్మా కంపెనీలలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇటీవల పరిశ్రమల్లో జరిగిన ప్రమాద ఘటనల వివరాలు

- 2024లో చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం ఫార్మా కంపెనీలో బాయిలర్ పేలి కార్మికుడు చనిపోయాడు. అదేవిధంగా భువనగిరిలోని ఇండస్ట్రియల్ పార్కులో రియాక్టర్ పేలి కార్మికులు గాయపడ్డారు. అదే సంవత్సరం బీబీనగర్ గ్రామ శివారులోని శ్రీయా కంపెనీలో అణు రియాక్టర్ పేలింది. గతంలోనే బీబీనగర్ మండలం నెమరగోముల వద్ద గల కంపెనీలో రియాక్టర్‌లు పేలి ఎనిమిది మంది కార్మికులు చనిపోయారు. ఈ ఘటన అనంతరం ఆ కంపెనీ మూతపడింది.
- ఈ ఏడాది జనవరి 4న పెద్ద కందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో ప్రాడక్ట్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఫైర్ డివైసెస్ ఫిల్లింగ్, ప్రెస్సింగ్ బ్లాక్‌లో కెమికల్ పెల్లెట్స్‌ను తూకం వేసే సెక్షన్‌లో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు చనిపోయాడు. మరికొందరు గాయపడ్డారు. ఇదే కంపెనీలో 2012, 2019, 2020లో జరిగిన ప్రమాదాల్లో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.
- ఏప్రిల్ 29న మోటకొండూరు మండలం కాటేపల్లి వద్ద ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో నలుగురు కార్మికులు దుర్మరణం చెందారు. మరికొందరు గాయపడ్డారు.
- జూలై 7న ప్రీమియర్ పరిశ్రమలో పీఆర్‌డీసీ బ్లాక్– 2లో కెమికల్‌ను తూకం వేస్తున్న క్రమంలో కెమికల్ మధ్య రాపిడి ఏర్పడి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి.
- మంగళవారం పెద్ద కందుకూరు ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో స్టీమ్ పైప్ ఓపెన్ చేసే క్రమంలో జరిగిన ప్రమాదంలో సదానందం అనే కార్మికుడు మృతి చెందాడు.

ఎక్స్‌ప్లోజివ్, ఫార్మా కంపెనీలకు అడ్డా..

భువనగిరి, రాయిగిరి, బీబీనగర్ పారిశ్రామిక వాడలోని రాయిగిరి, నెమరగోముల, కొండమడుగు, బీబీనగర్, యాదగిరిగుట్ట, పెద్ద కందుకూరు, మోటకొండూరు మండలం కాటేపల్లి, చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం, దండు మల్కాపురం, దేవలమ్మ నాగారం, ఎల్లంబావి, తంగడపల్లి, చౌటుప్పల్, ధర్మోజిగూడెం, లింగోజి గూడెం, ఆరెగూడెం, పంతంగి, ఎస్.లింగోటం మందోళ్ల గూడెం, చిన్న కొండూరు, జైకేసారం, పోచంపల్లి మండలం దోతిగూడెం, అంతమ్మగూడెం, ఆలేరు మండలం టంగుటూరు ఇలా జిల్లా వ్యాప్తంగా పేలుడు పదార్థాల పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు ఉన్నాయి.

ఆలేరులో విషాదం

ఆలేరు: ఉన్న ఊరిని కన్న వారిని వదిలి బతుకుదెరువు కోసం వచ్చిన వలస కార్మికుడి మృతి బాధిత కుటుంబంలో విషాదాన్ని నింపింది. గోదావరిఖని ప్రాంతానికి చెందిన సదానందం (48) ఉద్యోగం రీత్యా భార్య అఖిల, ఇద్దరు కుమారులతో ఆలేరుకు వచ్చి స్థిరపడ్డాడు. మైత్రి కాలనీలో నివాసం ఉంటున్నారు. పెద్దకుమారుడు శ్రీరామ్ సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నాడు. చిన్నకుమారుడు శ్రీనాథ్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. సదానందం దాదాపు 25ఏళ్లుగా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. కార్మిక యూనియన్‌లోనూ చురుకుగా వ్యవహరించే సదానందం మంగళవారం కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందడంతో మైత్రి కాలనీలోని ఆయన ఇంటి వద్ద విషాదం అలుముకుంది. ఆలేరులో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

డ్యూటీ షిఫ్ట్ ఛేంజ్?

సదానందం మంగళవారం మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లాల్సి ఉండగా, ఉదయం షిఫ్ట్‌కి మార్చుకున్నట్లు తెలిసింది. అయితే యూనియన్ సమావేశానికి హాజరుకావాలనే ఆలోచనతో ఉదయం షిఫ్ట్‌కు హాజరైనట్లు సమాచారం.



సదానందం ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

మాతం ప్రదర్శన



మాతం ప్రదర్శన నిర్వహిస్తున్న షియా ముస్లింలు

భువనగిరిటౌన్ : మహమ్మద్ ప్రవక్త మనువడు ఇమాం హుస్సేన్, ఆయన అనుచరులు 72 మంది బలిదానాన్ని స్మరిస్తూ మంగళవారం భువనగిరిలో మాతం ప్రదర్శన నిర్వహించారు. ఖిలా పీర్ల చావిడి నుంచి జంఫ్‌ఖానగూడెంలోని హజ్రత్ అబ్బాస్ పీర్ల కొట్టం మీదుగా, ఖాజీ మోహల్లా బీబీకా అలావా పీర్ల చావిడి వరకు మాతం ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో షియా సంఘం అధ్యక్షుడు సయ్యద్ రజాహుస్సేన్, ప్రధాన కార్యదర్శి కల్బే హుస్సేన్, కార్య నిర్వాహక అధ్యక్షుడు సయ్యద్ మహేది హుస్సేన్, ప్రతినిధులు లాయక్ అలీ, హైదర్ అలీ, తఖీ హుస్సేన్, సజ్జాద్‌హుస్సేన్, అస్గర్ అహ్మద్, అద్నాన్ రజా పాల్గొన్నారు.

ఆలేరును ఎడారిగా మార్చిన బీఆర్ఎస్



కొల్లూరు గ్రామంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరురూరల్: గత ప్రభుత్వం పాలనలో ఆలేరు ప్రాంతాన్ని ఎడారిగా మార్చారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ పనులు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కింద మంజూరైన రోడ్డు పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇల్లును ప్రారంభించారు. అనంతరం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గోదావరి జలాల ద్వారా మరోసారి చెరువులను నింపుతామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామాల్లో ఘన విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, మాజీ వైఎస్ ఎంపీపీ గాజుల లావణ్యవెంకటేష్, పారునంది భాస్కర్, నీలం పద్మ, వెంకటేశ్వర రాజు, చిలుకు కృష్ణ, జాలపు వనజారెడ్డి, దీపిక, నీలం వెంకటస్వామి, పిల్లలమర్రి శంకరయ్య, దశరథ, శ్రీపాల్‌రెడ్డి, ఆరె ప్రశాంత్, కర్రె అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే..



జూలూరు, రుద్రవెల్లి గ్రామాల మధ్యన లోలెవల్ బ్రిడ్జి పైనుంచి వరద ప్రవహిస్తుండటంతో బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు



శివారెడ్డిగూడెం, దంతూర్ గ్రామాల మధ్యన అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి

- తొమ్మిదేళ్లుగా సాగుతున్న జూలూరు- రుద్రవెల్లి బ్రిడ్జి పనులు
- మూడున్నర ఏళ్లు దాటినా ముందుకు పడని శివారెడ్డిగూడెం బ్రిడ్జి
- వర్షాకాలంలో స్తంభిస్తున్న రాకపోకలు

భూదాన్‌పోచంపల్లి: ప్రభుత్వాలు మారినా మూసీ నదిపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణాలు పూర్తికావడం లేదు. ప్రభుత్వం లోలెవల్ బ్రిడ్జిలను హైలెవల్ బ్రిడ్జిగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేసినా చేసిన పనులకు బిల్లులు వస్తలేవని సదరు కాంట్రాక్టర్లు పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. ఫలితంగా వర్షాకాలంలో భూదాన్‌పోచంపల్లి మండలం నుంచి బీబీనగర్, భువనగిరి మండలాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పిల్లర్ల దశలోనే..

భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు- రుద్రవెల్లి గ్రామాల మధ్యన నిర్మించిన లోలెవల్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు నాబార్డు నుంచి రూ.8.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. 2016 జూన్‌లో పనులు ప్రారంభించారు. కానీ భూసేకరణలో అధికారుల జాప్యం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి నాబార్డు ఇచ్చిన గడువు 2021 మార్చి 31తో ముగియడంతో ఆ నిధులు ల్యాప్స్ అయ్యాయి. అనంతరం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.10.50 కోట్లు మంజూరు కావడంతో ఏడాది క్రితం 8 పిల్లర్లను అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు.

మూసీ పొంగితే స్కూల్ దుమ్మా..

పోచంపల్లి, బీబీనగర్ రెండు మండలాల ప్రజలు రాకపోకలు సాగించడానికి జూలూరు-రుద్రవెల్లి గ్రామాల మధ్యన ఉన్న మూసీ బ్రిడ్జే ప్రధానమైనది. ఈ మార్గం గుండానే పోచంపల్లి మండల ప్రజలు బీబీనగర్, భువనగిరి, ఘట్కేసర్‌కు వెళ్తుంటారు. దీంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అంతేకాక బీబీనగర్ మండల పారిశ్రామల్లో పనిచేసేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి యువకులు వెళ్తుంటారు. అదేవిధంగా బీబీనగర్ మండలం రుద్రవెల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు పోచంపల్లి మండలం జూలూరు జెడ్పీ హైస్కూల్‌కు వస్తుంటారు. వర్షాకాలంలో లోలెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీ పొంగి ప్రవహిస్తుంటుండంతో ఈ మార్గంలో రాకపోకలు ఒక్కోసారి 15 నుంచి 20 రోజుల వరకు స్తంభిస్తుంటాయి. దీంతో మూసీ పొంగిన ప్రతిసారి రుద్రవెల్లి గ్రామ విద్యార్థులకు స్కూల్ బంద్ అవుతుంది.

వర్షాకాలంలో ఇబ్బంది అవుతోంది



మా ఊర్లో 5వ తరగతి వరకే ఉంది. గ్రామం నుంచి 20 మంది విద్యార్థులం జూలూరు హైస్కూల్‌కు ఆటోలు, బస్సుల్లో వెళ్తున్నాం. రుద్రవెల్లి, జూలూరు మధ్యన బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో స్కూల్‌కు వెళ్లలేదు. వర్షాకాలంలోనైతే బిక్కుమంటూ వచ్చిపోతుంటాం. మూసీ పొంగినప్పుడల్లా స్కూల్‌కు వెళ్లలేకపోతున్నాం.

– దర్శనం తులసి, 7వ తరగతి, రుద్రవెల్లి గ్రామం, బీబీనగర్ మండలం

బ్రిడ్జిని పట్టించుకోవడం లేదు



జూలూరు-రుద్రవెల్లి బ్రిడ్జిని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. తొమ్మిదేళ్ల క్రితం పనులు మొదలు పెట్టారు. ఇంకా పిల్లర్ల దశలోనే ఉన్నాయి. వర్షాకాలంలో లోలెవల్‌బ్రిడ్జి పై నుంచి వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. భువనగిరికి వెళ్లాలంటే పెద్దరావులపల్లి మీదుగా చుట్టూ 22 కిలోమీటర్లు తిరిగి పోవాల్సి వస్తుంది. – వట్టిపల్లి శ్రీశైలం, రైతు, జూలూరు గ్రామం, భూదాన్‌పోచంపల్లి

రెండుసార్లు గడువు పొడిగించినా సాగని పనులు

శివారెడ్డిగూడెం-రెడ్డిబావి(దంతూర్) గ్రామాల మధ్యన చిన్నేరుపై నిర్మించిన లోలెవల్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.6.22 కోట్లు మంజూరు చేసింది. గత ప్రభుత్వ హయాంలో 2022 జనవరిలో పనులు ప్రారంభించారు. అగ్రిమెంట్ ప్రకారం ఏడాదిన్నర లోపు అంటే సెప్టెంబర్ 2023లోపు పనులు పూర్తి చేయాల్సి ఉంది. కాని బిల్లులు రావడం లేదన్న కారణంతో పిల్లర్ల దశలోనే పనులు నిలిచిపోయాయి. గడువుతీరినా ప్రభుత్వం మరోసారి ఈ సంవత్సరం మార్చి 31 వరకు పొడిగించింది. కానీ పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతి లేదు. రెండోసారి ఇచ్చిన గడువు కూడా ముగిసింది.

తప్పని తిప్పలు

ధర్మారెడ్డిపల్లి, వంకమామిడి, రెడ్డిబావి తదితర గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి రావడానికి, ఇంద్రియాల, శివారెడ్డిగూడెం, పెద్దరావులపల్లి గ్రామాల ప్రజలు చౌటుప్పల్‌కు వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం. రైతులు కూడా తమ పంట పొలాల వద్దకు ఈ మార్గం గుండా వెళ్తుంటారు. వర్షాకాలంలో లోలెవల్ బ్రిడ్జి పై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయి ఆ ప్రాంత ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సర్వేతోనే సరి..

ఇంద్రియాల, జంపల్లి గ్రామాల మధ్య మూసీపై బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.2.15 కోట్లు, శివారెడ్డిగూడెం, సూరెపల్లి గ్రామాల మధ్యన మూసీపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.25 కోట్లు మంజూరు చేసింది. గత సంవత్సరం ఆగస్టులో కేవీఆర్ కన్సల్టెంట్ సంస్థ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ అధికారులు సర్వే నిర్వహించారు. కానీ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు.

క్లుప్తంగా

విద్యార్థులను పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలి

- ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్



టీడీ స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం చేసుకుంటున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులను పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలని వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఎంజీయూలో పర్యావరణ పరిరక్షణ, ఘన వ్యర్థాలు, పర్యావరణ పునరుద్ధరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతేకాకుండా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌కు చెందిన టీడీ స్వచ్ఛంద సంస్థతో ఎంజీయూ ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. యువత పర్యావరణ పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ సోషల్ వర్క్, బయో కెమిస్ట్రీ కామర్స్, ఎకనామిక్స్ విద్యార్థులు తమ పరిశోధనలో పర్యావరణ అవసరాలను ఎంచుకోవాలన్నారు. అనంతరం టీడీ సంస్థ డైరెక్టర్ ఉత్సవ్ ప్రధాన్ తమ సంస్థ ద్వారా విద్యార్థులతో చేపట్టనున్న కార్యక్రమాల ప్రణాళికను వివరించారు. నల్లగొండ జిల్లా హాలియా మండలం కొత్తపల్లిలో తమ సంస్థ చేపట్టిన పరిశోధన వివరాలతో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలో ప్లాస్టిక్ రహిత పట్టణాల కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంజీయూ ఇండస్ట్రీ అకడమిక్ సెల్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి, మిర్యాల రమేష్, ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, అధ్యాపకులు తిరుమల, రామచందర్‌గౌడ్, శివరాం, సమ్రిన్ కాజ్మి, మురళి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

కోదాదరూరల్: టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలో మంగళవారం జరిగింది. చిలుకూరు మండలం సీత్లాతండాకు చెందిన ఇస్లావత్ హీరు (45) పని నిమిత్తం మంగళవారం టీవీఎస్ ఎక్సెల్‌పై కోదాడకు వస్తున్నాడు. హైదరాబాద్–విజయవాడ హైవేపై కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్‌లో ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్‌లో కట్టకమ్ముగూడెం క్రాసింగ్ వద్ద రోడ్డు దాటేందుకు వెళ్లాడు. అక్కడ క్రాసింగ్‌ను మూసివేయడంతో అదే మార్గంలో రాంగ్‌రూట్‌లో ఫ్లైఓవర్ వైపు వస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బైక్ చక్రంలో చీరకొంగు చిక్కుకొని..

- కిందపడిన తల్లి, కుమారుడు
- చికిత్స పొందుతూ తల్లి మృతి

చౌటుప్పల్: బైక్ చక్రంలో చీరకొంగు చిక్కుకొని తల్లి, కుమారుడు రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ తల్లి మృతిచెందింది. మంగళవారం చౌటుప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన బోయ సాయమ్మ(70), ఆమె కుమారుడు భిక్షం ఆదివారం చిన్నకొండూర్‌లో బంధువుల అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బైక్‌పై వెళ్లారు. అంత్యక్రియలు ముగిశాక ఇద్దరు కలిసి స్వగ్రామానికి బయల్దేరారు. చౌటుప్పల్ శివారులోని శ్రీని ఫార్మా కంపెనీ సమీపంలోకి రాగానే సాయమ్మ చీరకొంగు బైక్ వెనుక చక్రంలో చిక్కుకుంది. దీంతో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో సాయమ్మ, భిక్షం తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు వారిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సాయమ్మ సోమవారం రాత్రి మృతిచెందింది. భిక్షం చికిత్స పొందుతున్నాడు. మృతురాలి కోడలు బోయ అరుణ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పొంగిన వాగులు



అర్వపల్లి: పర్సాయపల్లిలో పొలాలు, చెల్కలను ముంచెత్తిన వర్షపు నీరు



అర్వపల్లి: కేజీబీవీ నుంచి ట్రాక్టర్‌లో విద్యార్థులను తరలిస్తున్న దృశ్యం



నాగారం: వర్ధమానుకోటలో చెక్‌డ్యాం వద్ద అలుగుపోస్తున్న బిక్కేరు వాగు



భూదాన్‌పోచంపల్లి: జూలూరు, రుద్రవెల్లి మధ్యన ప్రవహిస్తున్న మూసీ



నాగారం: వరద తాకిడికి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



తిరుమలగిరి: గుండెపురి చెరువు అలుగులో చేపలు పడుతున్న గ్రామస్తులు

వైద్యం వికటించిందని బాధితుల ఆందోళన

- నడుము నొప్పితో ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చిన గర్భిణి
- రిపోర్టులు వాట్సాప్‌లో చూసి సిబ్బంది ద్వారా మందులు ఇచ్చిన వైద్యురాలు
- ఇంటికి వెళ్లిన తర్వాత ప్రసవించిన గర్భిణి
- పురిట్లోనే మగ శిశువు మృతి

భువనగిరిటౌన్: నడుము నొప్పితో ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందిన గర్భిణి ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే మగ శిశువుకు జన్మనిచ్చింది. కానీ పురిట్లోనే శిశువు మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లికి చెందిన బూడిద ప్రశాంత్, తేజస్విని భార్యాభర్తలు. వీరికి మొదటి కాన్పులో పాప పుట్టగా.. ప్రస్తుతం తేజస్విని ఎనిమిది నెలల గర్భిణి. నెలవారీ వైద్య పరీక్షల కోసం తేజస్విని స్థానిక పీహెచ్‌సీకి వెళ్లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమెకు నడుము, తుంటి నొప్పి రావడంతో పీహెచ్‌సీ తీసుకెళ్లగా బంద్ చేసి ఉందని, ఆశ వర్కర్ సాయంతో భువనగిరిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా.. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రిన్స్ మెటర్నిటీ హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అక్కడ కూడా ఆస్పత్రి నిర్వాహకురాలైన మహిళా వైద్యురాలు అందుబాటులో లేదని, అయితే ఆస్పత్రి సిబ్బంది తేజస్విని ఆరోగ్య పరిస్థితి, గతంలో తీసుకున్న చికిత్స, మందులను వాట్సాప్‌లో వైద్యురాలికి పంపించగా.. వైద్యురాలు వీడియో కాల్ ద్వారా సూచించిన సూదులు, మందులను తేజస్వినికి ఆస్పత్రి సిబ్బంది ఇచ్చారని, కాసేపటికే నొప్పి తగ్గడంతో తేజస్విని రాత్రి ఇంటికి తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో తేజస్విని మగ శిశువును జన్మనివ్వగా.. వారిద్దరిని భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లగా, శిశువు మృతిచెందినట్లు వైద్యులు చెప్పారని వాపోయారు. తేజస్వినికి తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో ఆస్పత్రిలో చేర్చుకుని చికిత్స అందించారని పేర్కొన్నారు.

నెలలు నిండకముందే ప్రసవించింది

ఈ ఘటనపై ఆస్పత్రి వైద్యురాలిని వివరణ కోరగా.. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చిన గర్భిణి రిపోర్టులను వాట్సాప్‌లో చూశానని, అంతేకాని తన తప్పు లేదని ఆమె పేర్కొంది. నెలలు నిండక ముందే తేజస్విని డెలివరీ అయ్యిందని, తాను చేసిన వైద్యానికి, శిశువు మరణానికి సంబంధం లేదని, కొంత మంది కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె తెలిపింది.

కుటుంబ సభ్యుల ఆందోళన

వాట్సాప్ వైద్యం వికటించే శిశువు మృతిచెందాడని ఆరోపిస్తూ ప్రిన్స్ హాస్పిటల్ ముందు తేజస్విని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పోలీసులు ఆస్పత్రి ఎదుట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరస్పర రాజీతో వివాదం సద్దుమణిగింది. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తేజస్వినిని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద, జిల్లా ఆస్పత్రుల పర్యవేక్షణ అధికారి వీణ పరామర్శించి విచారించారు.

డిండికి భారీగా వరద


డిండి: ఎగువన కురుస్తున్న వర్షాలకు డిండి ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 36 అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 28.5 అడుగులుగా ఉంది. ఇన్‌ఫ్లో 3284 క్యూసెక్కులు వస్తుండగా.. ఎడమ కాలువ ద్వారా 120 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ పరమేష్ తెలిపారు.



నీటితో కళకళలాడుతున్న డిండి ప్రాజెక్టు

నాలుగు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి: హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు భారీగా వరద ఉధృతి కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రం వరకు మూసీ ప్రాజెక్టుకు 9,692 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా.. అధికారులు నాలుగు క్రస్టు గేట్లను ఐదు అడుగుల మేర పైకెత్తి 12,805 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం 643.50 వద్ద నిలకడగా ఉంచి ఎగువ నుంచి వస్తున్న వరదనీటిని దిగువకు వదులుతున్నామని అధికారులు తెలిపారు. ఆయకట్టులో పంటల సాగుకు కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.0 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ మధు తెలిపారు.



మూసీ ప్రాజెక్టు నుంచి దిగువకుపోతున్న నీరు

తాళం వేసిన ఇళ్లే టార్గెట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు

- చోరీలకు పాల్పడుతున్న యువకుడు, బాలిక
- ఇద్దరిని అరెస్ట్ చేసిన నకిరేకల్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నకిరేకల్: పట్టపగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి చోరీకి పాల్పడుతున్న యువకుడు, బాలికను నకిరేకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను మంగళవారం సాయంత్రం నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 3వ తేదీన నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డలో పరడ సుమలత ఇంటి తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఆభరణాలు, నగదు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నకిరేకల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ఉదయం నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామ స్టేజీ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టగా.. స్కూటీపై ఓ యువకుడు, బాలిక తిప్పర్తి నుంచి నకిరేకల్ వైపు వస్తుండగా పోలీసులు వారిని ఆపి విచారించారు. యువకుడు కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామానికి చెందిన వల్లమల్ల ప్రదీప్‌కుమార్ అలియాస్ బంటిగా పోలీసులు గుర్తించారు. బాలిక ఏపీకి చెందినదిగా గుర్తించారు. ప్రదీప్ నార్కట్‌పల్లి మండలం కేంద్రంలో తన అమ్మమ్మ వద్ద ఉంటూ బాలికతో కలిసి చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రదీప్‌కుమార్ గతంలో నకిరేకల్, శాలిగౌరారం, కట్టంగూర్, నల్లగొండ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 14 దొంగతనాలకు పాల్పడి ఎనిమిది నెలలు జైలు శిక్ష అనుభవించి వచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. జైలు నుంచి వచ్చాక ఏపీకి చెందిన బాలికతో పరిచయం పెంచుకుని, చెడు వ్యసనాలకు బానిసై మళ్లీ చోరీలు చేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ క్రమంలోనే వారిద్దరు కలిసి నకిరేకల్, కట్టంగూర్, చిట్యాల, నార్కట్‌పల్లి, నల్లగొండలో పట్టపగలు తాళం వేసిన ఇళ్లను ఎంచుకుని చోరీలు చేస్తున్నట్లు తమ విచారణలో తేలినట్లు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి రూ.7.84లక్షల విలువైన ఐదు తులాల బంగారం, 119 తులాల వెండి ఆభరణాలు, రూ.45 వేల నగదు, స్కూటీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను పట్టుకున్న నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు లచ్చిరెడ్డి, క్రిష్టాచారి, పోలీస్ సిబ్బంది మధుకర్, వెంకటేశ్వర్లు, జనార్దన్, శ్రీకాంత్, శ్రీను, సురేష్, సుధాకర్, నాగర్జున, శ్రీనివాస్‌ను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించి రివార్డులు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, నకిరేకల్ ఎస్‌ఐలు లచ్చిరెడ్డి, క్రిష్టాచారి పాల్గొన్నారు.

21న వలంటీర్ల ఎంపిక

నల్లగొండ టూటౌన్: కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గుజరాత్‌లో జరిగే వెస్ట్ జోన్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపునకు వెళ్లేందుకు గాను మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో అర్హులైన వలంటీర్లను ఈ నెల 21న ఎంపిక చేయనున్నట్లు ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ పసుపుల మద్దిలేటి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీలోని ఎన్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

అదుపుతప్పిన స్కూల్ బస్సు



రోడ్డు పక్కన గోతిలోకి జారిన బస్సు

మోత్కూరు: స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన గోతిలోకి జారింది. ఈ ఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఆరెగూడెం రహదారిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. మోత్కూరు మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన బస్సు సుమారు 35 మంది విద్యార్థులతో ఆరెగూడెం మీదుగా పాలడుగుకు వెళ్తుండగా.. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగా బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన గోతిలోకి జారింది. భయాందోళనకు గురైన విద్యార్థులు ఎమర్జెన్సీ ద్వారం ద్వారా బస్సులో నుంచి కిందకు దిగారు. సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గురుకుల వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్: రాష్ట్రంలో గురుకుల వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు, గదులకు కిటికీలు, టాయిలెట్స్‌కు తలుపులు, భోజన సదుపాయాలు సక్రమంగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకులాల్లో సీట్ల కోసం పోటీ ఉండేదని, నేడు గురుకుల విద్య అంటేనే భయపడే పరిస్థితికి వచ్చిందన్నారు. ప్రభుత్వం మెనూ విస్తరించిందని గొప్పలు చెప్పుకుంటున్నా గురుకులాల్లో అమలుకావడం లేదన్నారు. భోజనంలో నాణ్యత లేక అనేక మంది విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములు, పెద్ది బాలనర్సింహ, దాసరి సంజయ్, రెడ్డిపల్లి మనోహర్, పోతరాజు నాగేష్ ఉన్నారు.



కట్టంగూర్ కేజీబీవీలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కోదాదరూరల్: కుటుంబ కలహాలతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని గోల్డెన్‌సిటీ కాలనీలో సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్డెన్‌సిటీ కాలనీలో నివాసముంటున్న నూకల మహేష్(35) ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తల తీవ్ర గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన మహేష్ సోమవారం రాత్రి ఇంట్లో తాను నిద్రించిన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం 8 గంటల వరకు మహేష్ గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన అతడి భార్య సమీపంలో ఉంటున్న బంధువులకు విషయం చెప్పింది. వారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా.. మహేష్ ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలికపై అత్యాచారం.. తల్లికి 22ఏళ్ల జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): కన్న కూతురిపై అత్యాచారం జరగడానికి కారణమైన తల్లికి 22 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి రోజారమణి మంగళవారం తీర్పు వెలువరించారు. నల్లగొండ పట్టణంలోని లైన్‌వాడకు చెందిన గ్యారాల శివకుమార్ బీటీఎస్‌కు చెందిన వసంతపురి యాదమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకొని, మైనర్ అయిన యాదమ్మ కూతురుపై కూడా కన్నేశాడు. యాదమ్మ సహకారంతో శివకుమార్ బాలికను అత్యాచారం చేయడానికి ప్రయత్నించగా తిరస్కరించింది. బలవంతంగా బాలిక దుస్తులు విప్పి వీడియోలు తీసి, శారీరకంగా అనుభవించాడు. శివకుమార్‌కు పెళ్లి అయి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. బాధిత బాలిక 2023 మే 8న నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో తల్లి యాదమ్మ, శివకుమార్‌పై ఫిర్యాదు చేసింది. పోలీసులు వారిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. పోక్సో కోర్టు జడ్జి రోజారమణి మంగళవారం తుది తీర్పు వెలువరిస్తూ.. ఇద్దరిని దోషులుగా ప్రకటించింది. ఏ1గా ఉన్న గ్యారాల శివకుమార్ ఉదయం కోర్టుకు వచ్చినట్లే వచ్చి పారిపోయాడు. అతడు కోర్టుకు గైర్హాజరైనట్లుగా న్యాయస్థానం ప్రకటించి దోషిగా తేలుస్తూ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీచేసింది. తదుపరి కోర్టు ముందు హాజరుపర్చిన రోజు శిక్షను ఖరారు చేయడం జరుగుతుంది. ఏ2 యాదమ్మకు 22 ఏళ్ల జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధించారు. బాధితురాలికి రూ.10 లక్షలు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలు వినిపించారు.



కోర్టు తీర్పు

పదేళ్లు జైలు శిక్ష..

రామగిరి(నల్లగొండ), మర్రిగూడ: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి రోజారమణి తీర్పు వెలువరించారు. మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లికి చెందిన పోలె నరేష్ 2016 ఆగస్టు 22న అదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక విషయం తన తల్లికి చెప్పడంతో ఆమె మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ కె. బలరాం పోలె నరేష్‌పై పోక్సో కేసు నమోదు చేయగా.. అప్పటి నాంపల్లి సీఐ బాలగంగిరెడ్డి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు తుది తీర్పులో భాగంగా జడ్జి రోజారమణి నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.15,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

కారు డ్రైవర్‌కు..

కట్టంగూర్: ప్రమాదంలో కారుతో మహిళను ఢీకొని ఆమె మృతికి కారణమైన డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ నకిరేకల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ ఆరిఫ్ మంగళవారం తీర్పు వెలువరించారు. కట్టంగూర్ ఎస్‌ఐ మునుగోటి రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2015 మార్చి 18న శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన బట్టా సుమన్ తన బంధువైన మందుల పరిమళను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని స్వగ్రామం నుంచి అయిటిపాములలో శుభకార్యానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో చెర్వుఅన్నారం క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా.. ఖమ్మం జిల్లా వేపకుంట గ్రామానికి చెందిన కారు డ్రైవర్ అంగోతు కిశోర్‌కుమార్ హైదరాబాద్ నుంచి విజయవాడకు కారులో అజాగ్రత్తగా, అతివేగంగా వెళ్తూ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మందుల పరిమళ తలకు తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. సుమన్ తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ కేసు నమోదు చేశారు. ఈ కేసు తుది తీర్పులో భాగంగా సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్‌ఐ తెలిపారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్లు..

రామగిరి(నల్లగొండ): మానసిక దివ్యాంగురాలైన బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి రోజారమణి తీర్పు వెలువరించారు. అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన వీరంశెట్టి సాంబశివ 2017 ఏప్రిల్ 15న అదే గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలైన బాలికను ఇంట్లోకి ఎత్తుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక తల్లి అడవిదేవులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి రోజారమణి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.10లక్షల పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. నిందితులకు శిక్ష పడేలా సరైన ఆధారాలు సేకరించడంలో అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారులుగా జె. రవీందర్, ఏ. రమేష్‌బాబు, జె. శివకుమార్ వ్యవహరించారు.